
క్లుప్తంగా

అందరూ సుభిక్షంగా ఉండాలి


జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు


ఎమ్మెల్యే వెంకటేగౌడ


ఎమ్మెల్సీ భరత్

పలమనేరు/కుప్పం: మంచి వర్షాలు కురిసి రైతులు పచ్చటి పంటలతో సుభిక్షంగా, ప్రజలు ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలని జిల్లా ప్రజలకు ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ, చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ క్రోధి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలను సోమవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. పండుగను అందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని, అందరి ఇంటా శుభాలు కలగాలని ఆకాంక్షించారు.

మల్లేశ్వరస్వామికి మంత్రి పూజలు


మల్లీశ్వరస్వామికి మొక్కుతున్న మంత్రి పెద్దిరెడ్డి


సదుం: మండలంలో నడిగడ్డ పంచాయతీ మత్తుకువారిపల్లె సమీపంలోని మల్లేశ్వర స్వామి ఆలయాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సోమవారం సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, పుత్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్ తనిఖీ


బైరెడ్డిపల్లె ఎస్సీ హాస్టల్లో తనిఖీ చేస్తున్న మాదేశ్

బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లె ఎస్సీ హాస్టల్లో మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ జాతీయ మానవ హక్కులు, నేర నియంత్రణ బ్యూరో సంయుక్త కార్యదర్శి మాదేశ్ తెలిపారు. బైరెడ్డిపల్లె ఎస్సీ హాస్టల్‌ను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్లో మరుగుదొడ్లు, విద్యుత్, దోమల సమస్య అధికంగా ఉందని, దీనిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో రాజేష్, రాజారెడ్డి, సలీంబాషా, మహబూబ్, సాదిక్, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

వేడుకగా గంగజాతర


ప్రత్యేకాలంకారంలో గంగమ్మ

సదుం: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో గంగజాతరను సోమవారం వేడుకగా నిర్వహించారు. పాలమంద, రెడ్డివారిపల్లె, బూరగమంద, కురవపల్లె, చెరుకువారిపల్లెలో జాతర నిర్వహించారు. ఉగాది ముందు వచ్చే ఆది, సోమవారాలు జాతర నిర్వహించడం ఆనవాయితీ. సదుంలో అర్ధరాత్రి అమ్మవారి ప్రతిమను మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకువచ్చి నడివీధిలో ప్రతిష్ఠించారు. మహిళలు చలిపిండి దీపాలతో ఊరేగింపుగా వచ్చి మొక్కులు చెల్లించారు. ప్రత్యేకాలంకారంలో ఉన్న గంగమ్మను పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. సోమవారం సాయంత్రం ఊరేగింపుగా అమ్మవారిని తీసుకువెళ్లి నిమజ్జనం చేయడంతో జాతర ముగిసింది.

ఘనంగా రాహుకేతు పూజలు


విశేషాలంకారంలో స్వామి, అమ్మవారు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలను ఘనంగా నిర్వహించారు. స్వయంభు శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి మూలవర్లకు ఉదయం అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో రాహుకాల సమయం ఉదయం 7.30 నుంచి 9 గంటల మధ్య రాహు, కేతు, సర్పదోష నివారణ పూజలు చేశారు. ప్రత్యేక పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని దోషనివారణ చేసుకున్నారు. అనంతరం మొగిలీశ్వరస్వామిని భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మునిరాజు, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

మూడు సంస్కృతుల ఉగాది

- తమిళ, కన్నడ, తెలుగు సంస్కృతుల సమ్మేళనం
- రంగులు చల్లుకుంటూ రేపు పల్లెటూళ్లలో సంబరాలు
- అటు ఎన్నికల వేడి..ఇటు పండుగ కేళి

పలమనేరు: పలమనేరు, కుప్పం, పుంగనూరు ప్రాంతాలు అటు కర్ణాటక, ఇటు తమిళనాడు రాష్ట్రాలకు సరిహద్దులో ఉండడంతో ఇక్కడి పల్లెటూళ్లలో తెలుగు, కన్నడ, తమిళ సంస్కృతుల సమ్మేళనంతో ఉగాది పండుగను జరుపుకోవడం ఆనవాయితీ. మూడు ప్రాంతాల ఆచార, సాంప్రదాయాలు ఈ పండుగలో మిళితమై ఉండటం ప్రత్యేకత. ఏడాదిలోని అన్ని పండుగల కంటే ఉగాదినే స్థానికంగా ఇక్కడ తొలిపండుగగా జరుపుకోవడం పరిపాటి. ఈ పర్యాయం సార్వత్రిక ఎన్నికల వేడి ఎటూ ఉంటోంది. ఇటు పండుగ కేళితో ఆయా పార్టీలు తమదైన శైలిలో ముందుకుపోతున్నాయి.

ఉగాదిరోజు వేపాకు, బెల్లం

ఈ ప్రాంతంలో మంగళవారం తొలిరోజు పూజలు నిర్వహించాక విధిగా వేపాకు, బెల్లాన్ని (ఉగాది పచ్చడి)ని తమ బంధువులకు, కుటుంబీకులకు, చుట్టుపక్కల వారికి ఇచ్చి శుభాకాంక్షలు చెప్పడం ఆనవాయితీ. పెద్దల పాదాలకు నమస్కరించి వారి ఆశీస్సులను పొందుతారు. ఇదే ప్రాంతంలోని కన్నడుగులు దీన్ని బేవూ, బెల్లా అని పేరుతో పిలుస్తారు. పండుగను మాత్రం మూడు రకాల శైలితో జరుపుకుంటారు.

సమాధులకు పూజలు

తమిళనాడు నుంచి ఈ ప్రాంతానికొచ్చిన వారు పొంగళ్లు పెట్టి ప్రత్యేక పూజలు చేస్తారు. అలాగే కన్నడిగులు మంచినూనెతో దీపం పెట్టి ప్రత్యేక పూజలు చేస్తారు. ఇక స్థానికులు మాత్రం కొత్త బట్టలను శ్మశానానికి తీసుకెళ్లి తమ ఆత్మీయుల సమాధుల వద్ద విస్తరాకులో ఉంచి తళిగె వేస్తారు. తళిగెలోని భోజనాన్ని సమాధి ముందు కాకులకు ఆహారంగా ఉంచి ఇళ్లకొస్తారు. ఇళ్లలోని వృద్ధులు, మంచం పట్టిన వారికి సైతం కొత్త బట్టలను ధరింపజేస్తారు. ఇలా మూడు విభిన్న సంస్కృతుల మధ్య ఉగాదిని జరుపుకుంటారు.


ఉగాది పచ్చడి

పండుగ రోజు ఒబ్బట్ల ఘుమఘుమలు

ఈ ప్రాంతంలో పండుగ రోజు కన్నడిగులు, స్థానికులు ఒబ్బట్లు లేదా పోలీలు అని పిండివంటను తప్పనిసరిగా చేస్తారు. తమిళనాడు నుంచి వచ్చిన వారు మాత్రం చక్కెర పొంగళి చేయడం ఆనవాయితీ. ఇరుగు పొరుగు మహిళలు పరస్పరం పోలీల తయారీకి సాయం చేసుకుంటారు. ఘుమఘుమలాడే పోలీలకు నేతిని రంగరించి తింటారు.

రెండో రోజు వరస తొడుగులో అసలైన మజా

ఉగాది రెండో రోజు అంటే బుధవారం జరిగే పండుగే వరస తొడుగు. వరసకు బావా బావమరిది, వదిన, మరదళ్లు, బావా, మరదళ్ల మధ్య సరదాగా సాగే పండుగ ఇది. కొత్తగా పెళ్లైన దంపతులు అత్తగారి ఇంటికి వెళ్లడం ఇక్కడి సాంప్రదాయం. ఈ సందర్భంగా అల్లుళ్లకు బావమరుదులు ప్రత్యేక మర్యాదలను చేస్తుంటారు. ఇదే రోజు కర్ణాటక సమీప గ్రామాల్లో రంగులు చల్లుకోవడం ఆనవాయితీ. దీంతో పాటు దోసెలు పోస్తారు. మాంసాహారం వండుతారు. గ్రామాల్లో యువత కబడ్డీ, ఇతర క్రీడా పోటీల్లో తలమునకలై ఉంటారు.


పోలీలు


చక్కెర పొంగలి

పండుగ వ్యాపారం జోరు

వి.కోట: తెలుగు నూతన సంవత్సరం ఉగాది ప్రారంభం కానున్న సందర్భంగా సోమవారం పట్టణం జనసంద్రంతో నిండిపోయింది. ఇటు హిందువుల ఉగాది, అటు ముస్లింల రంజాన్ పండుగ రెండు రోజుల వ్యవధిలో రావడంతో స్థానిక మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. ఎటుచూసినా పూలు, బట్టలు, పూజాసామగ్రి, సరుకులు కొనడానికి గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు రావడంతో రోడ్లన్నీ రద్దీగా కనిపించాయి. పలుమార్లు పట్టణంలో ట్రాఫిక్ అంతరాయం కలిగింది. ఎప్పటికప్పుడు పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నా సమస్య మాత్రం తీరలేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పట్టణంలో ఇదే తంతు కొనసాగింది.


కొనుగోలుదారులతో కిటకిట లాడిన పట్టణం

ముందస్తు ఉగాది వేడుకలు


నువ్వా..నేనా: టగ్ ఆఫ్ వార్ పోటీల్లో తలపడుతున్న విద్యార్థినులు

కుప్పం రూరల్: నూతన తెలుగు సంవత్సరం నుంచి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని బీసీఎన్ విద్యాసంస్థల చైర్మన్ బీసీ నాగరాజు ఆకాంక్షించారు. సోమవారం కుప్పం డిగ్రీ కళాశాల ఆవరణలో ముందస్తు ఉగాది వేడుకలు నిర్వహించారు. షడ్రుచుల ఉగాది పచ్చడిని పూజాది కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు అందజేశారు. అనంతరం ఉట్టికొట్టడం, తాడులాగడం, మ్యూజికల్ చైర్ తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. బీసీ నాగరాజు మాట్లాడుతూ, పండుగలను విశిష్టతను విద్యార్థులు తెలుసుకుని ప్రపంచానికి ఆదర్శవంతమైన తెలుగు సంస్కృతి గురించి చాటిచెప్పాలన్నారు. చైర్‌పర్సన్ శాంత, ప్రిన్సిపల్ సుధారాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఉట్టి కొట్టే పోటీలో ఉత్సాహంగా విద్యార్థులు

వైఎస్సార్‌సీపీతోనే దళితుల సంక్షేమం


సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద ప్రకాష్

సదుం: రాష్ట్రంలో దళితుల సంక్షేమం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని ఆ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనంద్ ప్రకాష్ తెలిపారు. సోమవారం సదుంలో దళిత సంఘ నాయకులతో కలసి ఆయన మాట్లాడారు. దళితుల అభ్యున్నతికి ఐదేళ్లుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగానో కృషి చేశారని చెప్పారు. సంక్షేమ పథకాల రూపేణా పెద్ద సంఖ్యలో దళితులకు మేలు చేకూర్చారని కొనియాడారు. అంబేడ్కర్, జగజ్జీవన్‌రామ్ బాటలో నడుస్తున్న జగన్‌కు దళితజాతి అండగా నిలబడితే రానున్న రోజుల్లో మరింతగా అభివృద్ధి చేస్తారన్నారు. ప్రస్తుతం తిరుపతి లిబరేషన్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న విజయ్‌కుమార్‌కు సీఎంను విమర్శించే అర్హత లేదన్నారు. దళితులను అణగదొక్కి తమ స్వలాభం కోసం పని చేసే నాయకులతో అప్రమత్తంగా ఉండాలన్నారు. మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీలతో పాటు అన్ని వర్గాలకు అండగా ఉన్నారని, దళితులందరూ ఏకమై మరోసారి వైస్సార్‌సీపీని గెలిపిస్తే ఎంతో మేలు కలుగుతుందన్నారు. ఎంపీపీ ఎల్లప్ప మాట్లాడుతూ దళితులకు అండగా ఉన్న పెద్దిరెడ్డి కుటుంబ సభ్యుల విజయానికి కృషి చేయాలని కోరారు. ఎస్సీ విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీ మధు, జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, రెడ్డెప్ప, సీతాపతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు


పోలీసు, కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహిస్తున్న సీఐ చిన్నగోవింద్

గంగవరం: మండలంలోని పలు గ్రామాల్లో కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలతో వీధుల్లో సీఐ చిన్న గోవింద్ ఆధ్వర్యంలో సోమవారం కవాతు నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో ఓటర్లు ఎలాంటి రాజకీయ ప్రలోభాలకు గురి కాకుండా నిర్భయంగా ఓటు వేయాలని ధైర్యం పాదుకొల్పేందుకు ఈ కవాతు నిర్వహించినట్టు సీఐ చెప్పారు. మబ్బువారిపేట, మల్లేరు, మేలుమాయి క్రాస్, కల్లుపల్లెలో ఫ్లాగ్‌మార్చ్ చేసినట్టు ఆయన చెప్పారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అందరూ సహకరించాలని, ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, మద్యం పంపిణీ లాంటివి చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మారెమ్మకు అమావాస్య పూజలు


ప్రత్యేక పూజలందుకున్న విరూపాక్షి మారెమ్మ

పుంగనూరు: పట్టణంలో బస్టాండు వద్ద ఉన్న శ్రీవిరూపాక్షి మారెమ్మ ఆలయంలో సోమవారం అమావాస్య పూజలు నిర్వహించారు. అమ్మవారిని వేపాకు, పూలు, నల్లరంగు వేసి అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారికి నేతిదీపాలు వెలిగించారు. బూడిద గుమ్మడికాయలతో దిష్టి నివారణ పూజలు చేశారు. పెరుగు అన్నం, చక్కెర పొంగలి పెట్టి, ప్రసాద వినియోగం చేశారు.

అనుమతి కోసం ఆర్డీఓకు వినతి


ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న రాములవారి ఆలయ కమిటీ, వీహెచ్‌పీ నేతలు

పలమనేరు: శ్రీరామనవమి వేడుకల కోసం పట్టణంలో శ్రీరాముడు, ఆంజనేయుడు తదితరుల చిత్రాలతో ఉన్న జెండాలను కట్టుకునేందుకు అనుమతించాలని కోరుతూ స్థానిక రాములవారి ఆలయ కమిటీ, వీహెచ్‌పీ నేతలు సోమవారం ఆర్డీఓ మనోజ్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో గతంలో రాములవారి జెండాలను తొలగించారని వారు ఆర్డీఓ దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన ఆయన అనుమతి మంజూరు చేశారు.

సర్వభూపాల వాహనంపై రామయ్య


కల్పవృక్ష వాహనంపై కోదండరామస్వామి

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు సోమవారం రాత్రి 7 గంటలకు సర్వభూపాల వాహనంపై శ్రీకోదండరామస్వామి విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించారు. తొలుత ఉదయం 7 గంటలకు స్వామివారి కల్పవృక్ష వాహన సేవ వేడుకగా నిర్వహించారు. శ్రీకోదండరామస్వామి కల్పవృక్ష వాహనాన్ని అధిరోహించి ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు ఆలయంలోని కల్యాణ మండపంలో సీతా లక్ష్మణ సమేత శ్రీకోదండరామ స్వామి ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. పంచామృతంతో అభిషేకం చేశారు. తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్ స్వామి, డెప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్, కంకణభట్టార్, భక్తులు పాల్గొన్నారు.

ఆదరిస్తే మరింత అభివృద్ధి


గ్రామాలలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి స్వాగతం పలుకుతున్న మహిళలు

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సోమల(సదుం): వైఎస్సార్‌సీపీని ఆదరిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసే అవకాశం కలుగుతుందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. మండలవ్యాప్తంగా అన్ని పంచాయతీలలో సోమవారం ఆయన విస్తృత పర్యటన చేశారు. 81 చిన్న ఉప్పరపల్లె, చింపిరెడ్డిపల్లె, పేటూరు, పెద్ద ఉప్పరపల్లె, ఆవులపల్లె, నంజంపేట, పొదలకుంటపల్లె, కరకమంద, సోమల, నెల్లిమంద, తమిమ్మనాయనపల్లె, కందూరు, ఇడదలవారిపల్లె, నగిరిండ్లు గ్రామాలలో సమావేశాలు నిర్వహించడంతోపాటు జోరుగా ఎన్నికల ప్రచారం చేశారు. ఆయా గ్రామాలలో గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అర్హులందరికీ సంక్షేమ పథకాల ఫలాలను అందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకునేలా ప్రతి ఒక్కరూ మద్దతు పలకాలని, రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుకు వేయాలని కోరారు. ఎన్నికల సమయంలో మాత్రం కనిపించే నాయకుల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి సీఎం జగన్ ప్రత్యేక దృష్టి సారించారని, దశాబ్దాల కాలంలో కానరాని అభివృద్ధిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ఐదేళ్లలో చేశామని ఉద్ఘాటించారు. అభివృద్ధికి అడ్డుపడుతున్న ప్రతిపక్షాల కూటమికి ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో భారీ మెజార్టీ సాధించేలా అందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీపీ ఈశ్వరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ గంగాధరం, మధు, వైస్ ఎంపీపీలు ప్రభాకర, సయ్యద్, నాయకులు గణపతియాదవ్, సర్వేశ్వరి, ఝాన్సీలక్ష్మి, నాగభూషణంరెడ్డి, బాషా, రాజారెడ్డి, రమణారెడ్డి, సూర్యనారాయణరెడ్డి, నవీన్‌కుమార్‌రాజు, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మంత్రి పెద్దిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు


సమావేశానికి హాజరైన గ్రామస్తులు

మంత్రి పెద్దిరెడ్డిని విమర్శించడం కిరణ్‌కు తగదు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- చంద్రబాబు, కిరణ్ పాలనలో చిత్తూరుకు మొండిచేయి
- వారిద్దరికీ ఓటమి తప్పదు
- మంత్రి పెద్దిరెడ్డి అధిక మెజార్టీతో గెలుపు తథ్యం

రొంపిచెర్ల: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని విమర్శించడం మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డికి తగదని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి హితవు పలికారు. సోమవారం వారు రొంపిచెర్లలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రాష్ట్రం రెండు ముక్కలు కావడానికి కారకుడైన కిరణ్‌కుమార్ రెడ్డికి ఏపీలో ఎన్నికలలో పోటీ చేసే అర్హత లేదన్నారు. మంత్రి పెద్దిరెడ్డి ఏపీలోనే కాదు, ఇతర రాష్ట్రాలలోనూ, ఇతర దేశాలలోను కాంట్రాక్ట్ పనులు చేస్తున్నారని, డబ్బుల కోసం ఎవరనీ మోసం చేయలేదని అన్నారు. చంద్రబాబు, కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రులుగా పని చేసిన ఇప్పటి ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ఒరిగిందేమీ లేదని, ఎన్నికలలో వారిద్దరినీ ఓడిస్తామని తెలిపారు. టీడీపీ పాలనలో మండలంలో ఎక్కడైనా అభివృద్ధి చేసి ఉంటే చూపాలని సవాల్ విసిరారు. ఈ ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో చేసిన అభివృద్ధిలో కనీసం 10 శాతమైనా టీడీపీ చేసిందా? అని సూటిగా ప్రశ్నించారు. ఎమ్మెల్యేలుగా తామే గెలిచామని చెప్పకునే చల్లాబాబు వార్డు మెంబరుగా ఆయన తల్లి చల్లా ప్రేమల తమ్మ, ఎంపీటీసీగా ఆయన భార్య చల్లా సుప్రియా రెడ్డి ఎందుకు ఓడిపోయారని ప్రశ్నించారు. ఈ ఎన్నికలలో మంత్రి పెద్దిరెడ్డి అధిక మెజార్టీతో గెలుపొందడం తథ్యమని జోస్యం చెప్పారు. సమావేశంలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఇబ్రహీంఖాన్, వైస్ ఎంపీపీ విజయశేఖర్, డాక్టర్ శ్రీనాథ్, కరీముల్లా, ప్రశాంత్ రెడ్డి, సదాశివ రెడ్డి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మంచు తెరలు..మండుటెండలు..!


ఉదయం 7 గంటలకు పాలారు నది వంతెనపై నుంచి మంచు తెరల్లో కనిపిస్తున్న శాంతిపురం

దట్టమైన పొగమంచుతో రోజూ తెల్లవారుతోంది. ఉదయం 7:30 వరకూ కమ్ముకొంటున్న మంచు తెరలు 8:30 గంటలకు గానీ తొలగడం లేదు. ఆ తర్వాత 9 గంటల నుంచి నిప్పులు కక్కుతూ సాయంత్రం 5 గంటల వరకూ భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. దీంతో భారీగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వాస్తవానికి ఇక్కడ ఊటీ తరహాలో చల్లని వాతావరణం ఉంటుంది. అయితే ఈ పర్యాయం గరిష్టంగా 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతూండడం, ఉక్కపోత కారణంగా జనం అవసరమైతే తప్ప పనుల నిమిత్తం ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. - శాంతిపురం


మధ్యాహ్నం 2 గంటలకు జన సంచారం నామమాత్రంగా ఉన్న శాంతిపురం రోడ్డుపై తలపై చెంగు కప్పుకుని వెళ్తున్న మహిళ